teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 207 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 27 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## నేడే పార్లమెంట్ అఖిలపక్ష భేటీ

ఫిబ్రవరి 1న చరిత్రలో తొలిసారిగా ఆదివారం బడ్జెట్
విపక్షాల అస్త్రశస్త్రాలు సిద్ధం
ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం



05




## త్రీ రో కార్లకు ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్

# రద్దు.. ఫేక్

సోషల్ మీడియా వార్తలను కొట్టి పారేసిన ఎన్హెచ్ఏఐ
6 లేదా 7 సీట్ల కార్లకు పాస్ రద్దు అనేది పచ్చి అబద్ధం
వాహనదారులకు ఎన్‌హెచ్ఏఐ క్లారిటీ



02

ఇటీవల సోషల్ మీడియాలో 2026 జనవరి 1 నుంచి 3రో కార్లు (6 లేదా 7 సీట్లున్న కార్లు) కోసం ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ రద్దు చేశారని వార్తలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. దీంతో చాలామంది వాహనదారుల్లో ఒకింత అయోమయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారికంగా స్పందించింది.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

సంతోష్ రావుకు సిట్ నోటీసులు
విచారణకు హాజరు కావాలని ఆదేశం

.. వివరాలు 2లో




## సర్కార్‌పై వ్యతిరేకత ఉంది

పొత్తుపై ఇంకా తేల్చలేదు
కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రొ. కోదండరాం హాట్ కామెంట్స్

.. వివరాలు 2లో

అక్రిడిటేషన్ రూల్స్
# సవరణ

మీడియా కార్డు ఇకపై.. అక్రిడిటేషన్ కార్డు
డెస్క్‌లో మహిళలకు 33 శాతం కోటా తప్పనిసరి
జీవో నెం. 103 జారీ.. తదుపరి చర్యలకు సర్కార్ దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్) తెలంగాణ ప్రభుత్వం మీడియా అక్రిడిటేషన్ రూల్స్- 2025లో పలు కీలక సవరణలు చేస్తూ ఇవాళ తాజాగా జీవో నెం.103ను విడుదల చేసింది. ఈ సవరణల ద్వారా అక్రిడిటేషన్ల కేటాయింపులో మహిళలకు ప్రాధాన్యత

మిగతా 2 లో





## వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లకు కొత్త నిబంధనలు

అక్రిడిటేషన్ ఉంటేనే అనుమతి
సర్కార్ సంచలన నిర్ణయం
నిబంధనలు అమలుకు డీపీఆర్వోలకు మెమో జారీ



.. వివరాలు 2లో



## ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- అభివృద్ధికి మూడు సూత్రాలు
- క్యూర్, ప్యూర్, రేర్ మండలాలుగా విభజన
- సమతుల్య పాలనే ధ్యేయం
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్ష


హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): రైజింగ్ తెలంగాణ-2047లో భాగంగా ప్రభుత్వం సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని

మిగతా 2 లో

మావోయిస్టుల ఇలాకాలో
## మువ్వన్నెల రెపరెపలు

కర్రిగుట్టపై సగర్వంగా ఎగిరిన జాతీయ జెండా
తొలిసారి గణతంత్ర వేడుకలు నిర్వహించిన భద్రతా బలగాలు

12



## సింగరేణి టెండర్లలో "రూ. 6 వేల కోట్ల కుంభకోణం..?"

- నేడు గవర్నర్‌ను కలవనున్న కేటీఆర్ బృందం
- సీఎం, డిప్యూటీ సీఎంలపై ఆరోపణలు
- గవర్నర్‌కు నివేదిక సమర్పించనున్న బీఆర్ఎస్



హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ టెండర్ల ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం నేడు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలవనుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులపై వచ్చిన

మిగతా 2 లో

కర్తవ్య పథ్‌లో కన్నులపండువగా
## 77వ గణతంత్ర వేడుకలు

ముఖ్య అతిథులుగా యూరోపియన్ సమాఖ్య నేతలు
పరేడ్‌లో వందేమాతరం నినాదం
సాంప్రదాయ బగ్గీలో చేరుకున్న రాష్ట్రపతి ముర్ము



.. వివరాలు 2లో

## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై దుష్ప్రచారం

క్లారిటీ ఇచ్చిన తెలంగాణ ఫ్యాక్ట్ చెక్
అవన్నీ అవాస్తవాలని స్పష్టీకరణ
సీఎం అదృశ్యం అనే.. ప్రచారంపై సర్కార్ సీరియస్

05






## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టండి

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

గులాబీ గూటికి బీజేపీ నేతలు

5

మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.

# త్రీ రో కార్లకు ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ రద్దు.. ఫేక్




న్యూ ఢిల్లీ, జనవరి 26 (తీన్మార్ న్యూస్): ఇటీవల సోషల్ మీడియాలో 2026 జనవరి 1 నుంచి 3రో కార్లు (6 లేదా 7 సీట్లున్న కార్లు) కోసం ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ రద్దు చేశారని వార్తలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. దీంతో చాలామంది వాహనదారుల్లో ఒకింత అయోమయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారికంగా స్పందించింది. ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ రద్దుకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. అదంతా తప్పుడు సమాచారం అని ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది. యాక్టివ్ ఫాస్ట్‌ట్యాగ్ ఉన్న అన్ని వాణిజ్యేతర కార్లు / జీపులు / వ్యాన్లు యాన్యువల్ పాస్‌కు అర్హత కలిగి ఉన్నాయని స్పష్టం చేసింది.

### ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్

భారతదేశంలో జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు టోల్ చెల్లింపులను సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్యాగ్ విధానం తీసుకొచ్చింది. దీనిని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్‌ను పరిచయం చేసింది. ఈ పాస్ తరచుగా హైవేలపై ప్రయాణించే వ్యక్తిగత వాహనదారులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ కోసం ఒకేసారి రూ. 3000 చెల్లించాల్సి ఉంటుంది. దీనిద్వారా వాహనదారుడు గరిష్టంగా 200 టోల్ క్రాసింగ్స్ చేయవచ్చు. ఈ పాస్ దేశవ్యాప్తంగా ఉన్న ఎన్హెచ్ఏఐ టోల్ ప్లాజాల్లో చెల్లుబాటు అవుతుంది. రాజ్‌మార్గయాత్ర యాప్ ద్వారా యాన్యువల్ పాస్ యాక్టివేట్ చేసుకోవచ్చు. యాక్టివేషన్ తేదీ నుంచి ఇది ఒక సంవత్సరం పాటు చెల్లుతుంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు



హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ ఎంపీ సంతోష్ రావుకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావలని నోటీసుల్లో పేర్కొన్నారు. వరుసగా హరీష్ ఆ తరువాత కేటీఆర్ విచారణతో ఈ కేసులో కొత్త అంశాలు తెర మీదకు వచ్చాయి. తాజాగా ఇదే కేసులో మరో బీఆర్ఎస్ ముఖ్యనేత అయిన సంతోష్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వడం మరింత హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు ఈ కేసులో బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవటం లేదంటూ బీజేపీ ఆరోపిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వాదన భిన్నంగా ఉంది. ఇదే సమయంలో ఈ కేసులో ప్రభుత్వం ఇక కఠిన చర్యలకు సిద్ధం అవుతోంది.

# సర్కార్‌పై వ్యతిరేకత ఉంది

హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మా అభిప్రాయాన్ని కాంగ్రెస్‌కు స్పష్టంగా చెప్పామని తెలిపారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతిలో బంధీ కానీయొద్దని తెలిపారు. నేను కూడా ఫోన్ ట్యాపింగ్ కేసు బాధితుడినే అన్నారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసేటప్పుడు లేని భయం విచారణ సమయంలో మొదలైందని బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తే బీఆర్ఎస్ నేతలు చేయని అవినీతి లేదని విమర్శించారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ కుటుంబం తప్పా ఎవరూ బాగుపడలేదని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని కోదండరాం పిలుపునిచ్చారు.

# ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న అద్భుత ప్రగతిని కొనియాడారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

### తెలంగాణ రైజింగ్ విజన్ - 2047

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ విజన్ - 2047'ద్వారా రాష్ట్రాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తోందని గవర్నర్ అన్నారు. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యంలో భాగంగా, తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే మహత్తర లక్ష్యాన్ని పెట్టుకుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని మూడు ప్రధాన మండలాలుగా (క్యూర్, ప్యూర్, రేర్) విభజించి సమతుల్య పాలనను అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రం వరి ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని గవర్నర్ అన్నారు. ఇప్పటి వరకు రూ.20,617 కోట్లతో సుమారు 26 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణ విముక్తి కల్పించిందని అన్నారు. సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించడం, ధరణి సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు అనుకూలమైన భూభారతి చట్టాన్ని తీసుకురావడం వంటివి విప్లవాత్మక మార్పులని ఆయన పేర్కొన్నారు.

### మహిళా సాధికారత, యువతకు ఉపాధి

మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా రూ.40 వేల కోట్ల బ్యాంకు అనుసంధానం కల్పించడం గొప్ప విషయమని గవర్నర్ అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. 62,749 ఉద్యోగ నియామకాలు పూర్తి చేసి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు ఉపాధి కల్పిస్తున్న తీరును ఆయన ప్రశంసించారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, మెట్రో రెండో దశ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ రూపురేఖలను మారుస్తాయని గవర్నర్ ధీమా వ్యక్తం చేశారు. శాంతిభద్రతల విషయంలో 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025'లో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం రాష్ట్ర ప్రతిష్టను పెంచిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిబద్ధతతో నిర్వర్తించడమే మనం రాజ్యాంగ నిర్మాతలకు ఇచ్చే అసలైన నివాళి అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.

# మావోయిస్టుల ఇలాకాలో మువ్వన్నెల రెపరెపలు

### కర్రిగుట్టపై సగర్వంగా ఎగిరిన జాతీయ జెండా

### తొలిసారి గణతంత్ర వేడుకలు నిర్వహించిన భద్రతా బలగాలు



తెలంగాణ బ్యూరో, జనవరి 26 (తీన్మార్ న్యూస్): దశాబ్దాలుగా మావోయిస్టుల ఆధిపత్యంలో ఉండి, కనీసం అడుగుపెట్టడానికే సాహసించని ప్రాంతంలో సోమవారం భారత త్రివర్ణ పతాకం సగర్వంగా ఆవిష్కృతమైంది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా, కర్రిగుట్టల పరిసర ప్రాంతాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను భద్రతా బలగాలు అత్యంత వైభవంగా నిర్వహించాయి. ఈ మారుమూల అటవీ ప్రాంతంలో జాతీయ జెండా ఎగరడం ఇదే తొలిసారి కావడం విశేషం.

### తడపాల క్యాంపు వద్ద ఘనంగా వేడుకలు

కర్రిగుట్ట సమీపంలోని తడపాల పోలీస్ క్యాంపు వద్ద సీఆర్పీఎఫ్ 196, కోబ్రా 204 బెటాలియన్ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. జవాన్లు భారత్ మాతా కీ జై నినాదాల మధ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఒకప్పుడు మావోయిస్టులు ఉన్నట్లు చెప్పుకునే ఆ ప్రాంతంలో, సోమవారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.

### 'ఆపరేషన్ కగార్'తో మారిన ముఖచిత్రం


గత కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా 'ఆపరేషన్ కగార్'ను అత్యంత పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు అటవీ ప్రాంతాల్లోకి చొచ్చుకువెళ్లి తమ స్థావరాలను (క్యాంపులను) ఏర్పాటు చేసుకుంటున్నాయి. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని ఈ కర్రెగుట్ట ప్రాంతం సుదీర్ఘ కాలం పాటు మావోయిస్టులకు సురక్షిత ప్రాంతంగా ఉండేది. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్లలో అత్యధిక సంఖ్యలో మావోయిస్టులు మరణించడంతో వారి ప్రభావం గణనీయంగా తగ్గింది. భద్రతా బలగాలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ కర్రెగుట్టను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. అక్కడ శాశ్వత పోలీస్ క్యాంపుల ఏర్పాటుతో మావోయిస్టుల కదలికలకు అడ్డుకట్ట పడింది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ తొలిసారి అధికారికంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

# సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై దుష్ప్రచారం

హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ వివరణ ఇచ్చింది. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ఏఖీఖష్ఱజష్ట్రవఎఔ+ ఫ్యాక్ట్ చెక్ ఖాతా నుంచి అధికారిక వివరణతో స్పష్టం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి అధికారిక విదేశీ పర్యటనకు సంబంధించి, ఆయన 'అదృశ్యమయ్యారు', అలాగే ఎటువంటి అధికారిక సమాచారం లేకుండా ఆయన వ్యక్తిగత పర్యటన పై వెళ్లారని సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారం చేశారని వెల్లడించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకంగా చేసిన ప్రచారమేనని పేర్కొంది. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా ముఖ్యమంత్రి అధికారికంగా ఆమోదించిన పర్యటనకు సంబంధించిన వాస్తవాలను వక్రీకరించి, ప్రజలను తప్పుదారి పట్టించి గందరగోళం సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం ఇదని తెలిపింది. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమైనవి, బాధ్యతారహితమైనవి, అలాగే ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రమే. దయ చేసి ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మకండి. అలాగే అధికారులు చేసే ప్రకటనలను పరిశీలించండి' అని తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ ఒక ప్రకటన విడుదల చేసింది.

# అక్రిడిటేషన్ రూల్స్ సవరణ

మొదటి పేజీ తరువాయి



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Information &Public Relations Department - "The Telangana Media Accreditation Rules, 2025" - Amendments- Orders - Issued.

GENERAL ADMINISTRATION (I&PR) DEPARTMENT

G.O. Rt.No.103 Dated:24.01.2026.
Read the following:-

1. G.O. Ms. No. 252, G.A(I&PR) Dept., dt. 22.12.2025.
2. From the Special Commissioner, Information & Public Relations Department., Lr.No.6677/MR/2026 dt.24.01.2026

*****

ORDER:

The following amendments shall be issued to G.O.Ms.No.252 G.A. (I&PR) Dept., dt.22.12-2025.

AMENDMENTS

1. In Rule 4 under clause (M), the following shall be added, namely:
"(M) Media Managements shall earmark a minimum of thirty-three percent (33%) Women for Desk Journalists, which is mandatory. Priority shall also be given to women journalists under accreditation quota."
2. In the Rules, wherever the expression "Media Card" appears, it shall be read as "Accreditation Card".
3. In the Annexure Schedule -A in the Sl.No.1 under the Print Media category, publications having circulation above 2.5 lakh shall be given one additional accreditation card for the Mandal having a population above 1.50 lakh.
4. In the Annexure, Schedule-A in the Sl.No.1 under the Print Media category: the following shall be added.
Publications having circulation above 2.5 lakh shall be given one additional accreditation card in each categories of Sports, Culture, and Films "at State Level".
5. In the Annexure, Schedule-A in the Sl.No.2, the following shall be added "Publications having circulation from 75,001 to 2.5 lakh shall be given one additional accreditation card either in Sports / Culture / Filmscategories, "at the state level"
6. In Rule 3, sub-rule (2), clause (d)(a), the expression "Urdu big newspaper" shall be read as "Urdu Daily Newspaper".
7. In Rule 3, sub-rule (2), clause (d), after category (g), in the constitution of the State Media Accreditation Committee (SMAC), the following categories shall be added, namely:
"(h) The Representative of the Press Club, Hyderabad.
(i) The Representative of Desk Journalist from Big Daily Newspaper."
8. The Special Commissioner, I&PR Department, Hyderabad is requested to take further action in the matter, accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
CH. PRIYANKA
E.O.SPECIAL SECRETARY TO GOVERNMENT

To
The Special Commissioner,
Information & Public Relations Department,Hyderabad, Telangana
The Chairman, Media Academy of Telangana State,Hyderabad
(PTO)

ఇవ్వడంతో పాటు మరికొన్ని నిబంధనలల్లో ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇక మీడియా యాజమాన్యాలు డెస్క్ జర్నలిస్టుల విభాగంలో కనీసం 33 శాతం మహిళలకు అవకాశం కల్పించడాన్ని తప్పనిసరి చేసింది. అక్రిడిటేషన్ కోటాలో కూడా మహిళా జర్నలిస్టులకు ఫస్ట్ ప్రియారిటీ ఇవ్వాలని స్పష్టం చేసింది. 2.5 లక్షల కంటే ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు, 1.50 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న మండలాల్లో అదనంగా ఒక అక్రిడిటేషన్ కార్డు కేటాయించనున్నారు. 2.5 లక్షల సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు స్పోర్ట్స్, కల్చర్, ఫిలిం విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ఒక్కో అదనపు అక్రిడిటేషన్ కార్డును సర్కార్ మంజూరు చేసింది. అదేవిధంగా 75 వేల నుంచి 2.5 లక్షల లోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు స్పోర్ట్స్, కల్చర్, ఫిలిం విభాగాల్లో ఏదో ఒకదానిలో రాష్ట్ర స్థాయిలో ఒక అదనపు కార్డును ఇవ్వనున్నారు.

రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధితో పాటు పెద్ద దినపత్రికల నుంచి ఒక డెస్క్ జర్నలిస్ట్ ప్రతినిధిని కొత్తగా ఇద్దరు సభ్యులకు చోటు కల్పించనున్నారు. ఇకపై అక్రిడిటేషన్ నిబంధనల్లో ఎక్కడ 'మీడియా కార్డు' అని ఉన్నా దానిని 'అక్రిడిటేషన్ కార్డు'గానే పరిగణించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఉన్న 'ఉర్దూ బిగ్ న్యూస్ పేపర్' అనే పదాన్ని 'ఉర్దూ డైలీ న్యూస్ పేపర్'గా మారుస్తూ సవరణ చేశారు. ఈ సవరణల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంకకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది.

# వాహనాలపై ప్రెస్ "స్టిక్కర్లకు కొత్త నిబంధనలు"

తెలంగాణ బ్యూరో, జనవరి 26 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో వాహనాలపై "ప్రెస్" అనే పదాన్ని వాడే విషయంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రభుత్వ గుర్తింపు పొందిన అక్రిడిటేషన్ కార్డులు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై 'ప్రెస్' అని రాసుకోవాలని స్పష్టం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ మోటార్ వెహికల్ చట్టం 1989 ప్రకారం అనధికారికంగా వాహనాలపై లేదా రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లపై 'ప్రెస్' అనే పదాన్ని వాడటం చట్టరీత్యా నేరమని అధికారులు పేర్కొన్నారు. చాలా మంది వ్యక్తులు తప్పుడు మార్గాల్లో, ప్రైవేట్ సంస్థల గుర్తింపు కార్డులతో ఈ లోగోలను వాడుతున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

### జిల్లా అధికారులకు ఆదేశాలు

సమాచార శాఖ కమిషనర్ జారీ చేసిన ఈ మెమో ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అందరు జిల్లా పౌర సంబంధాల అధికారులు తమ పరిధిలో ఈ నిబంధనలు అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అక్రిడిటేషన్ కార్డులు లేని వారు ఎవరైనా తమ వాహనాలపై ఉన్న 'ప్రెస్' లోగోలను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రస్తుతం అనేక మీడియా సంస్థలలో పనిచేస్తున్న జర్నలిస్టులు తమ సంస్థలు ఇచ్చిన ఐడీ కార్డులను ఆధారం చేసుకుని వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లు వాడుతున్నారు. అయితే తాజా ఉత్తర్వులతో అక్రిడిటేషన్ లేని వారందరికీ ఇది ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. అయితే, నకిలీ జర్నలిస్టులను అరికట్టడానికి, అసలైన జర్నలిస్టులకు గుర్తింపునిచ్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమించిన వారిపై రవాణా శాఖ, పోలీస్ శాఖ ద్వారా జరిమానాలు విధించే అవకాశం కూడా ఉంది.

# సింగరేణి టెండర్లలో "రూ. 6 వేల కోట్ల కుంభకోణం..?"

మొదటి పేజీ తరువాయి



ఆరోపణలపై సాక్ష్యాధారాలతో కూడిన నివేదికను గవర్నర్‌కు అందజేయబో తున్నట్లుగా తెలుస్తోంది మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి బంధువు సృజన్ రెడ్డికి లబ్ధి చేకూర్చేలా సింగరేణి టెండర్ల నిబంధనలను మార్చారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. సుమారు రూ.6 వేల కోట్ల విలువైన టెండర్లలో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నేతలు వాదిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను తీసుకువచ్చి, తమకు కావలసిన సంస్థలకే టెండర్లు దక్కేలా చేశారని ఆరోపిస్తున్నారు. సింగరేణి సంస్థకు రావాల్సిన లాభాలను పక్కదారి పట్టించి, ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని గవర్నర్‌కు ఇచ్చే ఫిర్యాదులో పేర్కొనబోతున్నట్లుగా తెలుస్తోంది. సింగరేణి టెండర్లప ప్రక్రియలో కుంభకోణంపై సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తి లేదా సీబీఐతో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది.

# మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్





హుస్నాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): హుస్నాబాద్ నియోజకవర్గంలోని పోతారం (ఎస్) గ్రామంలోని మొదటి వార్డు మెంబర్ గోల్లేని యాదమ్మ సమ్మయ్య లు గత ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే గా గెలవాలని సమ్మక్క సారలమ్మ మొక్కు కొన్నారు. గత జాతర సమయంలో మొక్కులు చెల్లించడం వీలుకాకపోవడంతో సోమవారం హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేత మేడారం సమ్మక్క సారలమ్మ లకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు. తన అభిమాని మొక్కులు పూర్తి చేసి వారి కుటుంబ సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. వారి కుటుంబం ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యాలతో ఉండాలని పిల్లలకు ఆశీర్వాదం అందించారు. తమ అభిమాన నేత అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న సందర్భంగా గొల్లెని యాదమ్మ సమ్మయ్యలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# భారత రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

### హాస్టల్ డైరెక్టర్ ఎల్.పి రాజ్ కుమార్



హనుమకొండ కేయు, జనవరి 26 (తీన్మార్ న్యూస్):లి భారత రాజ్యాంగ ఫలాలు అందరికీ అందే విధంగా యూనివర్సిటీ స్కాలర్స్ కృషి చేయాలని హాస్టల్ డైరెక్టర్ ఎల్.పి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం గణతంత్ర దినోత్సవ సందర్భంగా విఆర్ఎస్ హాస్టల్ ముందు స్కాలర్స్ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను హాస్టల్ డైరెక్టర్ ఎగరవేశారు. ఈ సందర్భంగా రాజకుమార్ మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం పని చేశాడని, దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత 1950 జనవరి 26న, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, రాజ్యాంగం సమాజంలో ఉన్న పౌరులకు హక్కులు కల్పించిందని, విధులు నిర్వర్తించాలని సమాజంలో మనుషులకు సమానత్వ భావన కలుగ జేసిందని భారత రాజ్యాంగ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు రాములు, విష్ణు, డి.తిరుపతి, అంబాల కిరణ్, కేతపాక ప్రసాద్ కందికొండ తిరుపతి, బోస్కా నాగరాజ్, చింత ఆంజనేయులు, అంకిల్లా శంకర్, సూర్య కిరణ్, సోమన్న, జానకి రాములు, సూర్య, స్వామి, సురేష్, చందు, బాబు, కిరణ్, హాస్టల్ కేర్ టేకర్ పిండి వేణు తదితరులు పాల్గొన్నారు.

# బండారి రాములు ముదిరాజ్ మృతి

### నివాళులు అర్పించిన గ్రామ ఉద్యోగ వ్యాపార సంఘం



చెన్నారావుపేట, జనవరి 26 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బండారి రాములు ముదిరాజ్ ఆరోగ్య రీత్యా సోమవారం ఉదయం 5:30 గంటలకు మరణించారు. విషయం తెలుసుకున్న ఉప్పరపల్లి గ్రామ ఉద్యోగ వ్యాపార వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్, స్తానిక గ్రామస్తులు, బందువులతో కలిసి బండారి రాములు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి,కుమారులు ఐలుమల్లు, రాంబాబు, కృష్ణ లతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాములు మంచి సేవా గుణం ఉండేవారని, కమ్యూనిస్ట్ భావాలు కలిగి ఉండేవారని, బతుకుదెరువు కోసం కొన్ని సంవత్సరాల కిందట చిలకమ్మ నగర్ వెళ్ళి అక్కడ నివాసం ఉండేవాడని,మళ్ళీ ఇటీవల స్వగ్రామం ఉప్పరపల్లి కి వచ్చి,జీవనం సాగిస్తున్నా క్రమంలో అనారోగ్య రీత్యా సోమవారం ఉదయం 5.30 గంటలకు మరణించారని, రాములు కు ఆయన భార్య కేతమ్మ సేవలు అందరికీ ఆదరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కుమారులు బండారు ఐలుమల్లు, రాంబాబు, కృష్ణ, కూతురు కవిత, మనవళ్ళు మనవరాళ్ళు శివ, శిరీష, రాహుల్, నిఖిల్, రిషి, హర్షిత్, వంశీ, రచన, సుమ శివ, పార్వతి, రాజు, లచ్చుమ్మ, రాజమణి, యమున, బందువులు రామ చంద్రు, అశోక్, ధనుంజయ, శ్రీహరి, యాకయ్య, మల్లయ్య, చంద్రమౌళి, చిరుత వెంకటేశ్వర్లు యాదలక్ష్మి, భారత, పద్మ,లచ్చుమ్మ, రాజమణి,యమున, గ్రామ కుల బంధువులు నిమ్మనబోయిన రమేష్, చిలకలపల్లి పెద్ద వీరస్వామి, పులి చేరాలు, పులి బిక్షపత, ఈర్ల పెద్ద రమేష్,చిన్న రమేష్, ఐలుమల్లు,ఈర్ల వీరస్వామి, ఐలుమల్లు, చెలకలపల్లి చిన్న వీరస్వామి, ఐలుమల్లు, రామ చంద్రు, చిలకమ్మ నగర్ సర్పంచ్ మాదరబోయిన నరేష్, నవీన్, గ్రామస్తులు పోలాటి రామ్ రెడ్డి, మేరుగు బాబు, చింతకింది అశోక్, ఊడుగుల ఐలయ్య, ఉమా రెడ్డి లతో పాటు వివిధ గ్రామాల బందువులు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటిన గణతంత్ర దినోత్సవ వేడుకలు

### రాజ్యాంగ విలువలతో సమగ్ర అభివృద్ధే లక్ష్యం: జిల్లా కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 26 (తీన్మార్ న్యూస్): సోమవారం జిల్లా కేంద్రంలోని డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ముందుగా పోలీసులు, సాయుధ దళాలు, ఎన్ సీసీ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 జనవరి 26న భారతదేశం స్వతంత్ర, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిన సందర్భంగా ఈ రోజును పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. మన రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, రాజ్యాంగ సభ సభ్యుల కృషి అభినందనీయమని, ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కల్పించే గొప్ప రాజ్యాంగం మనదని కలెక్టర్ అన్నారు. స్వాతంత్ర్య సాధనలో ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకుంటూ, జిల్లా అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల జీవితాల్లో కీలక మార్పుకు దారితీసిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు కోటి 85 లక్షల 97 వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయగా, రూ.97 కోట్ల 43 లక్షలు మహిళలకు ఆదా అయిందన్నారు.

### వైద్య ఆరోగ్య సేవలు

పేదలకు భరోసా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య బీమా పరిమితిని ప్రభుత్వం 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. జిల్లాలో 39,605 మంది ఈ పథకం ద్వారా వైద్య సేవలు పొందగా, రూ.88 కోట్ల 13 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఔషధి ద్వారా 1,03,402 మందికి వైద్య సేవలు, 5,690 మంది మహిళలకు ఆరోగ్య మహిళా క్యాంపులు, 65 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మహాదేవపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతు బరోసా పథకం ద్వారా ప్రతి సీజన్కు ఎకరాకు రూ.6 వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 1,24,496 మంది రైతులకు రూ.96 కోట్లు చెల్లించామని చెప్పారు. రైతుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బీమా పథకంలో 72,058 మంది నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తున్నామని తెలిపారు. 46,840 ఉచిత వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు, గృహజ్యోతి పథకం ద్వారా 56,525 కుటుంబాలకు రూ.37 కోట్ల 42 లక్షలు ప్రభుత్వమే సబ్సిడీ చెల్లించినట్లు పేర్కొన్నారు. నిరుపేదలకు గౌరవ నివాసం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 3,943 ఇండ్లు మంజూరు, 3,180 ఇండ్లకు మార్క్ అవుట్ ఇచ్చామని, ఇప్పటి వరకు రూ.51 కోట్ల 40 లక్షలు విడుదల చేశామని తెలిపారు. పేదలకు వరం మహాలక్ష్మి గ్యాస్ పథకం, ఈ పథకం ద్వారా 68,311 మందికి రూ.500కే గ్యాస్ ఇస్తున్నామని ఇప్పటి వరకు 2,36,243 సిలిండర్లు సరఫరా చేసి రూ.6 కోట్ల 55 లక్షల సబ్సిడీ చెల్లించినట్లు తెలిపారు. 277 రేషన్ దుకాణాల ద్వారా 1,37,950 కార్డుదారులకు బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. వానాకాలం పంట ద్వారా 1,15,853 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.274 కోట్లు చెల్లించామని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా శక్తి ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. సమ్మక్క --సారక్క మహిళా జిల్లా సమాఖ్యలో 87,134 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. బ్యాంకు లింకేజి ద్వారా ఇప్పటి వరకు రూ.240 కోట్లకు పైగా రుణాలు, 1,17,220 ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసినట్లు చెప్పారు. భూపాలపల్లి మున్సిపాల్టీలో రూ.113 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, పట్టణ మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి, వ్యక్తిగత రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాలు, నిరుపేదల సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, పార్లమెంట్, శాసన మండలి, శాసన సభ్యులకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు, జిల్లా ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి, మీడియా మిత్రులకు జిల్లా కలెక్టర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తదుపరి ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఆర్డిఓ బాలకృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

### విబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి



ఆత్మకూరు, జనవరి 26 (తీన్మార్ న్యూస్): ఉపాధి హామీ పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధార స్తంభం వంటిదని,దీనిని బలహీనపరచడం దేశాభివృద్ధికి ఏ మాత్రం మంచిది కాదని ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుకు వ్యతిరేకంగా ఏఐసీసీ మరియు పిసిసి ఆదేశాల మేరకు సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ విబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దుచేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను నిలిపివేసి, పేదల పక్షాన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో పనులకు సంబంధించి వేతనాలు 100 శాతం కేంద్రం నుండి వచ్చేవని ఇప్పుడు కేంద్రం 60 శాతం భరిస్తే, మిగతా 40శాతం భారం రాష్ట్ర ప్రభుత్వాలపై పడుతుందన్నారు. ప్రజలకు ఉపాధి హక్కు, పంచాయతీలకు పాలన హక్కులు తిరిగి కల్పించాలని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, ప్రజలకు ఉపాధి హక్కును, గ్రామ పంచాయతీలకు పాలనా హక్కులను తిరిగి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తూ,గ్రామ పంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా లభించిన అధికారాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కొత్త చట్టంతో సాంకేతిక సమస్యలు ఏర్పడతాయని, కాంట్రాక్టర్ ఆధారిత ప్రాజెక్టులుగా మారబోతున్నాయి అన్నారు.విబీ జీ రామ్ జీ చట్టం ద్వారా నిరుద్యోగం తీవ్రంగా పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు తగ్గుతాయని, పట్టణాలకు వలసలు పెరిగి గ్రామీణ జీవన ప్రమాణాలు తగ్గిపోతాయన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా, జనవరి 26 (తీన్మార్ న్యూస్): భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు కలెక్టరేట్ ఆవరణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. ఎస్పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, అసిస్టెంట్ కలెక్టర్లు, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు బహూకరించారు.





# ఘనంగా కేయులో గణతంత్ర దినోత్సవ వేడుకలు

హనుమకొండ కేయు, జనవరి 26 (తీన్మార్ న్యూస్): 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా సమిష్టిగా కృషి చేద్దాం అని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సారథ్యంలో పరిపాలన భవన ప్రాంగణంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వైస్ చాన్సలర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కాడెట్ల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి బోధన, బోధనేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వవిద్యాలయంలో పరిపాలనా, అకడమిక్, నిర్వహణ పరమైన సంస్కరణలు అమలవుతున్నాయని తెలిపారు. యూనివర్సిటీ లక్ష్యాలు వికసిత్ భారత్, రైజింగ్ తెలంగాణ దిశగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరిశోధనలకు ప్రోత్సాహం అందించే దిశగా తొలిసారిగా వైస్ చాన్సలర్ అవార్డులు ప్రవేశపెట్టామని, వీటిలో బెస్ట్ పరిశోధన పాత్రలు, ప్రాజెక్ట్, పేటెంట్ల కు నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందిచామన్నారు. ముఖహాజరు గుర్తింపు విధానం అమల్లోకి వచ్చిందని, రూసా నిధులను వినియోగంలోకి తీసుకొచ్చామని తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా డిజిటలైజేషన్, ఇంటర్నెట్ బ్యాండ్‌విడ్త్ పెంపు, బాలికల వసతి గృహంలో డైనింగ్ హాల్ నిర్మాణం, యూనివర్సిటీ కాంపౌండ్ వాల్ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులను సంపూర్ణంగా



అభివృద్ధి చేసి ఇండస్ట్రీ రెడీగా తీర్చిదిద్దేందుకు, ఎన్.ఈ.పి. 2020, స్టేట్ అండ్ సెంట్రల్ విద్యా పాలసీ లకు అనుగుణంగా యు.జి. కోర్స్ సిలబస్ రివైజ్ చేయటం, అమలు చేయటం జరిగిండ్, పి.జి. సిలబస్ కూడా సిద్దంగా ఉన్నాం. అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భారత రాజ్యాంగం అత్యున్నతమైనదని,



హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గత 20 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయం ప్రచురిస్తున్న కాకతీయ యూనివర్సిటీ న్యూస్‌లెటర్ (వివేచన) ను విడుదల చేశారు. అలాగే చరిత్ర విభాగ జర్నల్ కాకతీయ జర్నల్ అఫ్ హిస్టారికల్ స్టడీస్ , ఆంగ్ల విభాగ జర్నల్ కాకతీయ జర్నల్ అఫ్ ఇంగ్లీష్ స్టడీస్, బోధన ఉద్యోగుల (అకుట్) డైరీలను ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒప్పంద అధ్యాపకులు, పార్ట్‌టైమ్ అధ్యాపకులు, విశ్రాంత ఉద్యోగులు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్‌లాల్, డాక్టర్ బి. రమ, డాక్టర్ ఎన్. సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ బి. సుకుమారి తదితరులు పాల్గొన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. క్యాంపస్‌లో విశ్రాంత ఉద్యోగులు, బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కూడా జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల సంయోజకులు గా వ్యవహరించారు.

# మేడారాన్ని సందర్శించిన న్యూజిలాండ్ మావోరి తెగ ప్రతినిధులు

## గద్దల ప్రాంగణంలో హాకా నృత్య ప్రదర్శన

## కళాకారులతో కలిసి నృత్యం చేసిన మంత్రి సీతక్క

తాడ్వాయి, జనవరి 26 (తీన్మార్ న్యూస్): ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్క--సారలమ్మ మహాజాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడారం గద్దల ప్రాంగణంలో మావోరి తెగ వారి సంప్రదాయ నృత్యమైన హాకా నృత్యాన్ని వారు ప్రదర్శించారు. హాకా నృత్యం అనేది మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే సంప్రదాయ నృత్యంగా ప్రసిద్ధి చెందింది. ఈ నృత్యంలో ముఖభావాలు, శరీర చలనలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. తెలంగాణ--న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, స్త్రీ--శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేసి వారి ఉత్సాహాన్ని పెంచారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని అన్నారు. ఆదివాసీ జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం మావోరి తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్క--సారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల





ప్రసాదాన్ని అందజేసి మావోరి తెగ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం

## పనులు శూన్యం :చల్లా ధర్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే

పరకాల, జనవరి 26 (తీన్మార్ న్యూస్): పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెప్పేది ఒకటి, చేసేది మరోటని, వారి పాలన మొత్తం అసత్య ప్రచారాలు, మోసాల పునాదుల మీద నడుస్తోందని ధ్వజమెత్తారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తయిన అభివృద్ధి పనులకు రంగులు వేసి మళ్లీ ప్రారంభాలు చేయడమే కాంగ్రెస్ పాలనకు పరాకాష్ట అన్నారు. మా ప్రభుత్వంలో వేసిన శిలాఫలకలను ధ్వంసం చేసి కొత్తవి పెట్టి శంకుస్థాపనలు చేయడం తప్ప, పరకాలలో కొత్తగా మంజూరైన అభివృద్ధి పనులు ఒక్కటైనా లేవని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు గల్లంతయ్యాయని, కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా రెండు నెలల పెన్షన్లు, రైతుబంధు ఎగ్గొట్టి లబ్ధిదారులు, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఎక్కడా కొరత లేకుండా అందుబాటులో ఉన్న యూరియా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు లభించడం లేదో ప్రజలు ఆలోచించాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేకు పరకాలలో అభివృద్ధి కనిపించడం లేదని వ్యాఖ్యానించడంపై స్పందిస్తూ, ప్రజల్లో తిరిగితే అభివృద్ధి ఉందో లేదో తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ఒకసారి పరకాల ప్రజలను అడిగితేనే నిజం చెబుతారని అన్నారు. రెండేళ్లుగా వంద పడకల ఆసుపత్రి, దామెర చెరువు మినీ ట్యాంక్ బండ్, ఇంటిగ్రేటెడ్ వెజ్ -- నాన్ వెజ్ మార్కెట్,



డిగ్రీ కాలేజ్ ఎందుకు పూర్తికాలేదో స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దామెర చెరువులో ఉన్న బోట్ ఎటు పోయిందో కూడా ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే స్కాములు, పర్సంటేజీల ప్రభుత్వం అని వ్యాఖ్యానించిన చల్లా ధర్మారెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి గారికి, మంత్రులకు పరిపాలనపై పట్టు పూర్తిగా తప్పిందన్నారు. ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. మేడారంలో క్యాబినెట్ సమావేశం పెట్టినా జాతర పనులు ఇప్పటికీ పూర్తికాలేదని, అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయడం లేదని మండిపడ్డారు. ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు గుర్రుగా ఉన్నారని అన్నారు.

వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో పరకాల గడ్డపై గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, కో ఆప్షన్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, జనవరి 26 (తీన్మార్ న్యూస్): 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. స్వతంత్ర సమరయోధులుకు సన్మానం చేసి,ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం శాఖల ప్రగతిపై ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె.అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# 4వ బెటాలియన్ ఆవరణలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు





మామునూరు, జనవరి 26 (తీన్మార్ న్యూస్): మామునూరు నాలుగో బెటాలియన్ ఆవరణలో గణతంత్ర దినోత్సవమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెటాలియంలో వివిధ హోదాల్లో విధులను నిర్వర్తిస్తున్న వారికి వచ్చిన అతి ఉత్కృష్ట, ఉత్కృష్ట, కఠిన సేవ, ఉత్తమ సేవ, సేవ పథకాలను కమాండెంట్ చేతుల మీదుగా వారికి అందజేయడం జరిగింది. అలాగే విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి కమాండెంట్ మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్ 1950 జనవరి26 న భారత జాతీయ జెండాను ఎగరవేసి దేశాన్ని సంపూర్ణ గణతంత్ర దేశంగా ప్రకటించారని, మరియు రాజ్యాంగ రచనకు డా.బి. ఆర్.అంబేద్కర్ మరియు ఎంతోమంది మేధావులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి అధ్యయనం చేసి ప్రజాస్వామ్య విధానంలో రూపొందించి అనేక సవరణల అనంతరం 1949 నవంబర్26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కృష్ణప్రసాద్, శ్రీనివాస్ రావు, వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు విజయ్, కార్తీక్, రవి, సర్వర్, వెంకటేశ్వర్లు,రాజ్ కుమార్, కృష్ణ మరియు అధికారులు, బెటాలియన్ సిబ్బంది, మినిస్ట్రియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# టీఆర్పీ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



భూపాలపల్లి, జనవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ హాజరయ్యారు. ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ, 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి దేశ పౌరులకు సంపూర్ణ హక్కులు, స్వేచ్ఛలు కల్పించబడినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రూపొందిన రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు, సమాన హక్కులు వంటి అనేక ప్రజాస్వామ్య విలువలు ప్రజలకు లభించాయని తెలిపారు. ఈ రాజ్యాంగం వల్లే దేశ ప్రజలు గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. అనంతరం టిఆర్పి పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కి మరియు రాజ్యాంగ నిర్మాణ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాజ్యాంగం అమలైన ఈ పుణ్యదినాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, భూపాలపల్లి జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ముఖ్య అతిథిగా విచ్చేసిన అశోక్ ముదిరాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి పార్టీ జిల్లా నాయకులు నుగాల ప్రణయ్ రాజ్, సామల శ్రీలత రాజు, ఎస్‌బీఐ అనంతల సంపత్ (బొట్టు), అశోక్ మడే, సంతోష్ ముక్తేశ్వర్, రొడ్డ శ్రీను, జింకల శ్రీను, మామిడి శ్రీకాంత్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం భక్తులకు మంత్రి సీతక్క ఘన స్వాగతం

క్రమశిక్షణతో తల్లులను దర్శించుకోవాలని పిలుపు



ములుగు, జనవరి 26(తీన్మార్ న్యూస్): బుధవారం నుంచి జరిగే మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికారు. ములుగు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన అనంతరం దివ్యాంగులకు సహాయ పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ మేడారం జాతరకు వచ్చే భక్తులందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులందరూ క్రమశిక్షణతో మెలగాలని మంత్రి సీతక్క కోరారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్యూ విధానంను తప్పనిసరిగా పాటిస్తూ తల్లులను దర్శించుకోవాలని సూచించారు. భక్తులందరికీ శీఘ్ర దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## క్యూలైన్లు డిస్టర్బ్ చేయొద్దు

కొంతమంది భక్తుల అత్యుత్సాహం వల్ల ఇతర భక్తులకు ఇబ్బందులు కలగకూడదని చెప్పారు. క్యూలైన్లను డిస్టర్బ్ చేయకుండా, నిర్వాహకులు సూచించిన మార్గాల్లోనే వెళ్లాలని వెల్లడించారు. ప్రతి భక్తుడు స్వీయ నియంత్రణతో, క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. కాలినడకన వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు వేగంగా వెళ్లరాదని, ఓవర్ స్పీడ్, ఓవర్ టేక్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. భక్తుల భద్రత, సౌకర్యం కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, జాతరకు వచ్చే ప్రముఖులు కూడా సహకరించాలని కోరారు. భక్తులే మా ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి సీతక్క స్పష్టం చేస్తూ, అందరూ సహకరించి జాతరను శాంతియుతంగా, భక్తిభావంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# డ్రైవింగ్ సీటులోనే కుప్పకూలిన "ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్"

గుండెపోటుతో మృతి

19 మంది ప్రయాణికులను కాపాడి ప్రాణాలువదిలిన వైనం




తెలంగాణ బ్యూరో, జనవరి 26 (తీన్మార్ న్యూస్): డ్రైవింగ్ సీటులోనే ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ కుప్పకూలిపోయారు. ఈ సమయంలో 19 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు. గుండెపోటు రావడంతో బస్సును డ్రైవర్ నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన యాదాద్రి జిల్లా చౌటుప్పల్ వద్ద జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న ఏపీఆర్టీసీ డ్రైవర్‌కు ఛాతిలో నొప్పి రావడంతో బస్సును డ్రైవర్ రోడ్డులోనే ఆపేశారు. వెంటనే ఆయన్ను ప్రయాణికులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ వైద్యులు లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ బస్సు డ్రైవర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు విజయవాడ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ నాగరాజుగా గుర్తించారు. గొల్లపూడికి చెందిన నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమరావతి బస్సును మియాపూర్ నుంచి విజయవాడకు తీసుకెళ్తుండగా ఈ విషాదం చోటు చేసుకుంది. ఇక ఘటనతో ప్రయాణికులను మరో బస్సులో విజయవాడ తరలించారు.

# కులగణనలో బీసీలకు కేంద్రం పెద్ద మోసం

బీజేపీ, కాంగ్రెస్ తీరుపై కల్వకుంట్ల కవిత యుద్ధభేరి



హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): దేశంలో వెనుకబడిన తరగతుల కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మోసానికి పాల్పడుతోందని తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుల్లో ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రం విడుదల చేసిన కులగణన డాక్యుమెంట్‌లో 'బీసీ' అనే స్పెషల్ కాలమ్ లేకపోవడం బీసీ సామాజిక వర్గాలను అవమానించడమేనని ఆమె మండిపడ్డారు. గతంలో 2011లో కాంగ్రెస్ పార్టీ బీసీలను ఏ విధంగానైతే వంచించిందో ఇప్పుడు 2026లో బీజేపీ ప్రభుత్వం అదే పద్ధతిలో అన్యాయం చేస్తోందని విమర్శించారు.

## 29న రౌండ్ టేబుల్ సమావేశం

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనపై తప్పుడు గణాంకాలను వెల్లడిస్తోందని, దీంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కవిత ఆరోపించారు. కేవలం ప్రధాన కులాలే కాకుండా, బీసీల్లోని ప్రతి ఉప కులాన్ని కూడా విడివిడిగా లెక్కించాలని తెలంగాణ జాగృతి డిమాండ్ చేస్తోందని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో బీసీల హక్కుల కోసం తాము 'యుద్ధ భేరి' మోగిస్తామని స్పష్టం చేశారు. బీసీ మేధావులతో సంప్రదింపులు జరుపుతున్నామని ఈ మేరకు జనవరి 29న హైదరాబాద్‌లో కీలకమైన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించబోతున్నట్లుగా స్పష్ట చేశారు. ఈ భేటీలోలో బీసీలు, ఉప కులాలు మరియు సంచార జాతులతో చర్చించి, ఏ కులం ఎంత శాతం ఉందో శాస్త్రీయంగా ఒక నివేదికను తయారు చేస్తామని అన్నారు. ఆ డాక్యుమెంట్‌ను తెలంగాణ జాగృతి తరపున కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి, మా హక్కులను సాధించుకుంటామని కవిత తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో "కాంగ్రెస్‌ను బొంద పెట్టండి"

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

గులాబీ గూటికి బీజేపీ నేతలు



హైదరాబాద్, జనవరి 26 (తీన్మార్ న్యూస్): మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్‌మంటూ రైతుల అకౌంట్‌లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చున్న ఆయన మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.

# కర్తవ్య పథ్‌లో కన్నులపండువగా "77వ గణతంత్ర వేడుకలు"

ముఖ్య అతిథులుగా యూరోపియన్ సమాఖ్య నేతలు

పరేడ్‌లో వందేమాతరం నినాదం

సాంప్రదాయ బగ్గీలో చేరుకున్న రాష్ట్రపతి ముర్ము





న్యూ ఢిల్లీ, జనవరి 26 (తీన్మార్ న్యూస్): దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఈ ఏడాది వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సారి పరేడ్ 'వందేమాతరం – 150 ఏళ్లు' అనే థీమ్‌తో సాగింది. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి స్వరపరిచిన ప్రత్యేక గీతం ఈ వేడుకల్లో హైలైట్‌గా నిలిచింది. ముందుగా రాష్ట్రపతి భవన్ నుంచి ప్రెసిడెంట్ ముర్ముతో కలిసి ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్ డెర్ కిలిసి సాంప్రదాయ గుర్రపు బగ్గీలో కర్తవ్య పథ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రధాని నరేంద్ర మోడీ ఎదురెల్లి వారికి ఘన స్వాగతం పలికారు. ఆయన వెంటన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఉన్నారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కర్తవ్య పథ్ వేదికగా మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించగా అనంతరం జాతీయ గీతాలాపేన చేశారు.

ఇక తొలిసారిగా గణతంత్ర వేడుకల్లో భారత సైన్యం 'ఫేజ్డ్ బ్యాటిల్ అర్రే' ప్రదర్శనను చేపట్టింది. ఇందులో డ్రోన్లు, ట్యాంకులు, ఆర్టిలరీని నిజమైన యుద్ధరంగంలో ఉండే ఫార్మేషన్లలో ప్రదర్శించారు. ఈ పరేడ్‌లో ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించిన ఆయుధ వ్యవస్థల నమూనాలను ప్రదర్శించి, దేశ భద్రతా సన్నద్ధతను చాటిచెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేలా 30 శకటాలు ప్రదర్శించాయి. అయితే, రొటేషన్ పద్ధతి కారణంగా ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల శకటాలకు కర్తవ్య పథ్ పరేడ్‌లో అవకాశం దక్కలేదు.

# నేడే పార్లమెంట్ అఖిలపక్ష భేటీ

ఫిబ్రవరి 1న చరిత్రలో తొలిసారిగా ఆదివారం బడ్జెట్

విపక్షాల అస్త్రశస్త్రాలు సిద్ధం

ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం



న్యూ ఢిల్లీ, జనవరి 26 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ఈరోజు ఉదయం గం. 11లకు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఉభయ సభల్లో సమావేశాలు సజావుగా జరిగేందుకు సహకరించాలని అఖిలపక్షాన్ని కేంద్ర ప్రభుత్వం కోరనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 29వ తేదీన ఆర్థికసర్వే ప్రవేశపెట్టనుంది కేంద్ర ప్రభుత్వం. ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఆ రోజు ఆదివారం వచ్చింది. అయితే ఇలా ఆదివారం రోజు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. జనవరి 28 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ రెండు దశల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తుండగా, మార్చి 9వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ రెండో విడత బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తారు. కాగా గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, ఎస్ఐఆర్‌లపై కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. వివిధ రంగాల్లో సంస్కరణల కోసం పలు కీలక బిల్లులను తీసుకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే జేపీసీ పరిశీలనలో ఉన్న జమిలి ఎన్నికల కోసం 129 రాజ్యాంగ సవరణ బిల్లు కూడా ఈసారి పార్లమెంట్ ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విద్యారంగంలో సంస్కరణల కోసం వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లును కూడా ఈసారి సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.



# ఈ చర్మ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయకండి

దయాబెటిస్ అనేది రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో లేకపోవడం వల్ల వచ్చే సమస్య. ఇది శరీరంలోని అనేక భాగాలపై ప్రభావం చూపుతుంది. అందులో చర్మం కూడా ఒకటి. రక్తంలో చక్కెర స్థాయి దీర్ఘకాలం పాటు ఎక్కువగా ఉంటే, శరీరంలో రక్త ప్రసరణపై ప్రభావం పడుతుంది. అలాగే చర్మంలో ఉండాల్సిన తేమ శాతం తగ్గిపోతుంది. దీని వల్ల చర్మం తన సహజ రక్షణ శక్తిని కోల్పోయి, అనేక చర్మ సమస్యలు మొదలవుతాయి. చాలామంది ఈ లక్షణాలను సాధారణ సమస్యలుగా భావించి పట్టించుకోరు. కానీ ఇవి మధుమేహానికి ముందస్తు హెచ్చరికలుగా ఉండొచ్చు. అందుకే వీటిని గుర్తించడం చాలా అవసరం.

### చర్మంలో కనిపించే మార్పులు మధుమేహానికి సంకేతాలా?

- మధుమేహం ఉన్నవారిలో చర్మంలో కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి.
- చర్మం ఎక్కువగా పొడిబారడం
- తరచూ దురద లేదా మంటలు రావడం
- మెడ చుట్టూ నల్లటి మచ్చలు రావడం
- చిన్న గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడటం
- తరచూ ఫంగల్ లేదా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు రావడం
- పూతలు, మొటిమలు లేదా చర్మంపై ఎర్రగా మారడం
- ఇలాంటి లక్షణాలు కనిపిస్తే శరీరంలో చక్కెర స్థాయిలు సరిగా లేవని అర్థం.
- ఈ సమస్యను ఎలా నివారించాలి?
- చర్మంలో ఇలాంటి మార్పులు కనిపిస్తే ముందుగా రక్తంలో చక్కెర స్థాయిని పరీక్షించుకోండి.
- మధుమేహాన్ని నియంత్రించేందుకు సమతుల్యమైన ఆహారం తీసుకోండి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.
- డాక్టర్ సూచించిన మందులను సరిగ్గా వాడండి.
- చర్మాన్ని శుభ్రంగా, తేమగా ఉంచుకోండి.
- ఎక్కువ రసాయనాలు ఉన్న సబ్బులు, క్రీములు వాడకండి.
- చర్మానికి అనుకూలమైన ఉత్పత్తులనే ఉపయోగించండి.
- గాయాలు లేదా ఇన్ఫెక్షన్లను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించండి.
- చర్మం ద్వారా శరీరం తనలో ఉన్న సమస్యలను ముందే తెలియజేస్తుంది.
- కాబట్టి చిన్న లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.

# తగినంత నిద్రపోయినా తల ఎందుకు బరువుగా అనిపిస్తుంది?

సాధారణంగా నిద్ర తర్వాత శరీరం, మనస్సు ఉత్సాహంగా ఉండాలి. కానీ కొన్ని సందర్భాల్లో ఉదయం లేవగానే అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం కనిపిస్తుంది. ఇది శరీరంలో జరుగుతున్న మార్పులకు సంకేతం కావచ్చు. ఈ సమస్య ఎక్కువ రోజులు కొనసాగితే రోజువారీ పనులపై ప్రభావం చూపిస్తుంది. కాబట్టి దీనిని తేలికగా తీసుకోకూడదు.



### కారణాలివే..

ఆరోగ్య నిపుణుల ప్రకారం.. నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం, రాత్రి ఎక్కువగా మొబైల్, టీవీ వంటి స్క్రీన్లు చూడటం, ఒత్తిడి, ఆందోళన ఎక్కువగా ఉండటం, శరీరంలో నీటి లోపం(డీహైడ్రేషన్), సైనస్ సమస్యలు, హార్మోన్ల మార్పులు లేదా అసమతుల్య జీవన శైలి కారణాల వల్ల ఉదయం తల బరువుగా అనిపించవచ్చు.

### తల బరువుగా ఉన్నప్పుడు కనిపించే ఇతర లక్షణాలు:

- మగత(మత్తు)గా ఉండటం
- తల తిరగడం
- కళ్లలో మంట లేదా భారంగా అనిపించడం
- ఏకాగ్రత లోపించడం
- పని చేయాలనే ఉత్సాహం తగ్గిపోవడం
- చిరాకు, అసహనం
- మెడనొప్పి లేదా తలనొప్పి
- ఈ లక్షణాలు ఎక్కువకాలం ఉంటే ఆరోగ్య సమస్యకు సూచన కావచ్చు.

### ఎలా తగ్గించుకోవచ్చు?

- రోజూ ఒకే సమయానికి నిద్రపోయి, ఒకే సమయానికి నిద్ర లేవాలి.
- పడుకునే ముందు మొబైల్, టీవీ వంటివి చూడకూడదు.

రోజంతా తగినంత నీరు తాగాలి.

- తేలికపాటి, సమతుల్య ఆహారం తీసుకోవాలి.
- ఒత్తిడిని తగ్గించేందుకు యోగా లేదా ధ్యానం చేయాలి.

# మీ పాదాలు ఎప్పుడూ చల్లగా ఉంటున్నాయా? అసలు కారణం ఇదే



చలికాలంలో పాదాలు చల్లబడటం సహజమే అని చాలా మంది భావిస్తారు. సాక్స్ వేసుకున్నా, మందపాటి దుప్పటి కప్పుకున్నా పాదాలు వేడెక్కకపోవచ్చు. చాలామంది దీన్ని సాధారణమే అని వదిలేస్తారు. కానీ ఎప్పుడూ ఇలా ఉండటం మాత్రం సాధారణం కాదు. కొన్నిసార్లు పాదాలు చల్లగా ఉండటం శరీరంలో జరుగుతున్న లోపాలకు సూచన కావచ్చు.

ఆరోగ్య నిపుణుల ప్రకారం.. పాదాలు చల్లగా ఉండటానికి రక్త ప్రసరణ సరిగా లేకపోవడం ఒక ప్రధాన కారణం. పాదాలకు సరిపడా రక్తం చేరకపోతే అవి చల్లగా అనిపిస్తాయి.

### దీనికి కారణాలు ఇవి కావచ్చు:


- ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం
- శారీరక చురుకుదనం లేకపోవడం
- పొగ తాగడం
- వయస్సు పెరగడం
- చలికాలంలో రక్తనాళాలు కొంచెం కుచించుకుపోతాయి. దీనివల్ల రక్త ప్రసరణ తగ్గి పాదాలు చల్లగా, కొద్దిగా నీలం రంగులో కనిపించవచ్చు. కొన్నిసార్లు తేలికపాటి నొప్పి లేదా తిమ్మిరి కూడా ఉంటుంది. కానీ నడవడానికి ఇబ్బందిగా ఉంటే మాత్రం దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

### పాదాలను ఎలా జాగ్రత్తగా చూసుకోవాలి?

- పాదాలను వీలైనంత వెచ్చగా ఉంచుకోండి.
- ప్రతిరోజూ తేలికపాటి వ్యాయామం లేదా నడక చేయండి.
- ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవద్దు.
- రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా చెక్ చేయించుకోండి.
- పొగ తాగడం మానేయండి.

పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచుకోండి.

# ఈ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే కిడ్నీ వ్యాధులు తీవ్రతరం కాకుండా అడ్డుకోవచ్చు..!



మన శరీరంలో మూత్రపిండాలు అనేక విధులను నిర్వర్తిస్తాయి. ఇవి చూడడానికి చిన్నగా ఉన్నప్పటికీ అత్యంత శక్తివంతమైన అవయవాలు. రక్తాన్ని శుభ్రపరచడం, శరీరంలో వ్యర్థాలను తొలగించడం వంటి పనులను 24 గంటల పాటు చేస్తూనే ఉంటాయి. కనుక మనం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. అయితే మూత్రపిండాల సంబంధిత సమస్యలతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుతోంది. మూత్రపిండాల వ్యాధులు ఎటువంటి లక్షణాలు లేకుండానే అభివృద్ధి చెందుతాయి. కనుక వీటిని గుర్తించడం చాలా అవసరం. సమస్య తీవ్రమైన తరువాత బాధపడడం కంటే వాటి లక్షణాలను ముందుగానే గుర్తించి నివారించడం మంచిది.

### పరీక్షలు చేయించుకోవాలి..



మూత్రపిండాల సమస్యలను ముందుగా గుర్తించడానికి రక్తం, మూత్ర పరీక్షలు చేయంచుకోవడం అవసరం. సీరం క్రియాటినిన్, జిఎఫ్ఆర్ ( గ్లోమెరులర్ వడపోత రేటు) వంటి పరీక్షలు మూత్రపిండాల పనితీరును తెలియజేస్తాయి. అలాగే అదనపు ప్రోటీన్ ను గుర్తించడానికి యూరిన్ అల్బుమిన్ క్రియాటినిన్ నిష్పత్తి వంటి పరీక్షలు చేయించుకోవాలి. ఇది మూత్రపిండాల ఒత్తిడిని తెలియజేసే ఒక సంకేతం. అంతేకాకుండా మూత్రపిండాలు అధిక రక్తనాళ అవయవాలు కనుక వాటి ఆరోగ్యం గుండె ఆరోగ్యంతో సంబంధం కలిగి ఉంటుందని కూడా వైద్యులు చెబుతున్నారు. మూత్రపిండాల సమస్యలు ముందుగా అలసట, చీలమండలంలో వాపు, శ్వాస ఆడకపోవడం, వికారం, వాంతులు లేదా చర్మం దురద వంటి లక్షణాలను కనబరుస్తాయి. మూత్రంలో మార్పులు కూడా మూత్రపిండాల సమస్యలను తెలియజేస్తాయి. అయితే ఈ లక్షణాలు ఎల్లప్పుడూ స్పష్టంగా ఉండవు.

### ఈ టెస్టులు కూడా అవసరమే..

పురుషులలో విస్తరించిన ప్రోస్టేట్ కారణంగా మూత్రనాళంలో అడ్డంకులు ఏర్పడటం వలన మూత్రపిండాలపై వెన్ను ఒత్తిడి ఏర్పడుతుంది. ఈ లక్షణాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. అలాగే ఇవి ఇతర అనారోగ్య సమస్యలను కూడా సూచించవచ్చు. కనుక వీటిని ముందుగా గుర్తించి రక్తపరీక్షలు, మూత్రపరీక్షలు చేయించుకోవడం చాలా అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఇక మూత్రపిండాల సమస్యలు రాకూడదు అనుకునే వారు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం చాలా అవసరం. అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. శరీర బరువు అదుపులో ఉంచుకోవడానికి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. మద్యపానం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలి. అధిక ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. అలాగే యాంటీ ఇన్ఫ్లామేటరీ మందులను దీర్ఘకాలం పాటు వాడడం మానేయాలి. మూత్రపిండాల ఆరోగ్యం కొద్దిగా దెబ్బతినగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. దీని వల్ల సమస్యలు మరింత తీవ్రతరం కాకుండా జాగ్రత్త పడడంతో పాటు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వైద్యులు సలహా ఇస్తున్నారు.



# భారత్, పాక్ మ్యాచ్‌పై సందిగ్ధం

మరో రెండు వారాల్లో టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. ఈ మేరకు ఇప్పటికే అన్ని జట్లు తమ స్క్వాడ్‌లతో సిద్ధమయ్యాయి. అయితే, బంగ్లాదేశ్ జట్టు మాత్రం ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకుంది. ఇక అప్పటి నుంచి పాకిస్తాన జట్టు వింత ప్రకటనలతో టెన్షన్ పెంచుతోంది. ఇప్పటికే బంగ్లాకు మద్దతుగా టోర్నమెంట్ నుంచి తప్పుకుంటామని పుకార్లు రేకెత్తించడం, ఆపై ఐసీసీ హెచ్చరించడంతో కామ్‌గా స్క్వాడ్‌ను ప్రకటించింది. ఆ తర్వాత మరో కొత్త డ్రామకు తెరలేపింది. ఇప్పటికే బంగ్లాకు మద్దతు పలికి తలనొప్పులు తెచ్చుకున్న పాక్ జట్టు.. ఇప్పుడు సరికొత్త డ్రామకు ప్లాన్ చేసింది. ఫిబ్రవరి 15న భారత జట్టుతో జరగబోయే మ్యాచ్ నుంచి తప్పుకుంటామని, ఆ మ్యాచ్‌ను బహిష్కరించే ప్లాన్ చేస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్ మీడియా నివేదికల మేరకు పీసీబీ చెర్మన్ మొహ్సిన్ నఖ్వీతోపాటు పాక్ ప్రధాని సాబాజ్ షరీఫ్ జరపబోయే సమావేశంలో దీనిపై ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది. బంగ్లాకు మద్దతు తెలిపేందుకే ఇలాంటి నిర్ణయానికి ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 15న శ్రీలంకలో జరగాల్సి ఉంది. అయితే, పాకిస్తాన్ ఈ మ్యాచ్ నుంచి తప్పుకుంటే, ఐసీసీకి భారీగా ఆర్థిక నష్టం కలగనుంది. ఎందుకంటే, భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ నుంచే ఐసీసీకి భారీగా డబ్బులు సమకూరనున్నాయి. టీ20 ప్రపంచకప్ ఫైనల్, సెమీస్ కంటే కూడా ఈ రెండు జట్లు ఢీ కొనబోయే మ్యాచ్‌లకే భారీగా రేటింగ్ రానుంది. దీనిని ఐసీసీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. మరి ఇలాంటి మ్యాచ్ విషయంలో పాక్ నిర్ణయంతో ఐసీసీ తీవ్రంగా పరిగణించే ఛాన్స్ ఉంది. కఠిన చర్యలు తీసుకోవచ్చు అని తెలుస్తోంది. బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్నప్పటి నుంచి పీసీబీతోపాటు పాక్ మాజీ ఆటగాళ్లు వింత ప్రకటనలతో వివాదాలు సృష్టిస్తున్నారు. బంగ్లాకు మద్దతుగా పాకిస్తాన్ జట్టు కూడా టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకోవాలని మాజీ కెప్టెన్ రషీద్ ఖాన్ సూచించాడు. పాక్ జట్టు తప్పుకుంటే, ఐసీసీతో పాటు భారత్‌కు భారీ నష్టమంటూ తెలిపాడు. ఈ క్రమంలో తాజాగా పాకిస్తాన్ టీం భారత్‌తో మ్యాచ్ నుంచి తప్పుకోవాలని వార్తలు వినిపిస్తున్నాయి. షాబాజ్, మొహ్సిన్ నఖ్వీల మధ్య సమావేశం తర్వాత పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో చూడాలి.




# యువరాజ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ బ్రేక్ చేయడం అసాధ్యం

## విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ కీలక వ్యాఖ్యలు

తన గురువు, టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ బ్రేక్ చేయడం అసాధ్యమని విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ అంగీకరించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో టీమిండియా 8 వికెట్ల తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేసి అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా అర్థ శతకం బాదిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచాడు. 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సలతో 68 పరుగులతో అజేయంగా నిలిచి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ అనంతరం తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడిన అభిషేక్ శర్మ యువీ రికార్డ్‌ను బ్రేక్ చేయడం అంత ఈజీ కాదన్నాడు. 'నా జట్టు నా నుంచి ఆశిస్తున్నది విధ్వంసకర బ్యాటింగే. ప్రతీసారి ఇలా ఆడటం అంత సులువు కాదు. యువరాజ్ సింగ్ 12 బంతుల్లో చేసిన ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డ్‌ను బ్రేక్ చేయడం అసాధ్యం. కానీ భవిష్యత్తులో ఏమైనా జరగవచ్చు.దూకుడుగా ఆడటం అనేది పూర్తిగా మానసిక స్థితి, సహచర ఆటగా నుంచి లభించే మద్దతుపై ఆధారపడి ఉంటుంది. బ్యాటర్లందరూ బాగా ఆడుతున్నారు. ఈ సిరీస్ ముందు ముందు ఇంకా సరదాగా సాగుతోంది. లెగ్‌సైడ్ వైపు ఆడటం అనేది ఫీల్డ్ ప్లేస్‌మెంట్ మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ నాకు గ్యాప్ దొరికితే ఆఫ్ సైడ్ కూడా షాట్లు కొట్టగలను. నేను కేవలం ఫీల్డింగ్‌కు తగ్గట్లుగా ఆడాలనుకుంటాను.'అని అభిషేక్ శర్మ చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మ విధ్వంసానికి సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీ కూడా తోడవ్వడంతో 10 ఓవర్లలోనే న్యూజిలాండ్ విధించిన 154 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలోనే అందుకుంది. అభిషేక్ శర్మ బ్యాటింగ్‌కు ఫిదా అయిన అతని మెంటార్ యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా కొనియాడుతూనే ఎగతాళి చేశాడు. తన ఫాస్టెస్ట్ టీ20 హాఫ్ సెంచరీ రికార్డ్‌ను అభిషేక్ శర్మ అందుకోలేదని రెచ్చగొట్టాడు. 'అభిషేక్ శర్మ.. ఇప్పటికీ 12 బంతుల్లో 50 పరుగులు చేయడం నీ వల్ల కావడం లేదు కదా? కానీ బాగా ఆడావు - ఇలాగే కొనసాగించు.'అని ట్వీట్ చేశాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

# జట్టు ఎంపికలో నిలకడ ఉండాలి

## ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయొద్దు... టీమ్ ఇండియా సీనియర్ స్పిన్నర్ అశ్విన్



భారత తుది జట్టు ( ఎంపికపై సర్వత్రా చర్చ నడుస్తోంది. తాజాగా టీమ్ ఇండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జట్టులో ఒక కీలక ఆటగాడిని పక్కన పెట్టడం అంటే అది 'సర్కస్ ఫీట్' చేయడమేనని, అటువంటి సాహసాలు జట్టుకు నష్టం కలిగిస్తాయని అశ్విన్ హెచ్చరించారు. ప్రస్తుత న్యూజిలాండ్ పర్యటనలో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వరుసగా విఫలమవుతుండటంతో అతనిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత మ్యాచ్‌లలో తక్కువ స్కోరుకే అవుట్ అవ్వడంతో, మూడో టీ20లో అతని స్థానంలో ఇషాన్ కిషన్‌ను తీసుకోవాలని చాలామంది మాజీలు సూచిస్తున్నారు. అయితే, అశ్విన్ మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. ఒకట్రెండు మ్యాచ్‌లలో విఫలమైనంత మాత్రాన శాంసన్ వంటి ప్రతిభావంతుడైన ఆటగాడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా అశ్విన్ మాట్లాడుతూ.. "టీమ్ ఇండియా జట్టు ఎంపికలో నిలకడ ఉండాలి. ఒక ఆటగాడికి అవకాశం ఇచ్చినప్పుడు అతనికి తగినన్ని అవకాశాలు కల్పించాలి. కేవలం ఒక ఇన్నింగ్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం అంటే అది సర్కస్ ఫీట్ లాంటిదే అవుతుంది. ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. న్యూజిలాండ్ వంటి కఠినమైన జట్లపై ఆడుతున్నప్పుడు జట్టులో స్థిరత్వం చాలా అవసరం" అని పేర్కొన్నారు. అశ్విన్ విశ్లేషణ ప్రకారం.. సంజూ శాంసన్ బ్యాటింగ్ శైలి న్యూజిలాండ్ పిచ్‌లకు సరిపోతుంది. అతను షార్ట్ పిచ్ బంతులను సమర్థవంతంగా ఎదుర్కోగలడని, ఒక్కసారి లయ అందుకుంటే మ్యాచ్ ఫలితాన్ని మార్చగల శక్తి అతనికి ఉందని అశ్విన్ గుర్తు చేశారు. ఇషాన్ కిషన్ మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, శాంసన్ కు మరిన్ని అవకాశాలు ఇస్తేనే అతను తనను తాను నిరూపించుకోగలడని, వరుసగా మార్పులు చేయడం వల్ల జట్టులో అభద్రతా భావం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. కోచ్ గౌతమ్ గంభీర్ ఇప్పుడు ధర్మసంకటంలో పడ్డారు. ఒకవైపు ఇషాన్ కిషన్ గత మ్యాచ్‌లో అద్భుతమైన అర్ధ సెంచరీతో ఫామ్‌లోకి రాగా, మరోవైపు శాంసన్ వరుస డకౌట్లతో ఇబ్బంది పడుతున్నాడు. అశ్విన్ వంటి సీనియర్ ఆటగాడు బహిరంగంగానే శాంసన్ కు మద్దతుగా నిలవడంతో మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్, న్యూజిలాండ్ జట్లు ప్రస్తుతం సిరీస్‌లో సమానంగా ఉన్నాయి. నిర్ణయాత్మకమైన మూడో మ్యాచ్?లో గెలిచిన జట్టుకే సిరీస్ దక్కుతుంది. ఇటువంటి కీలక సమయంలో ప్రయోగాలు చేయకుండా, నమ్మకమైన ఆటగాళ్లతోనే బరిలోకి దిగాలని అశ్విన్ సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలను పక్కన పెట్టి, ఆటగాడి ప్రతిభను నమ్మి అవకాశం ఇవ్వడమే సరైన క్రీడా స్ఫూర్తి అని ఆయన స్పష్టం చేశారు.

# బుమ్రాకు విశ్రాంతి అవసరమా..?

## మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర ఆగ్రహం



భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక టీ20 సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌కు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్" పేరుతో జట్టు యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన ధ్వజమెత్తారు. బుమ్రా ఇప్పుడే సుదీర్ఘ విరామం తర్వాత జట్టుతో కలిశారని, కేవలం ఒక మ్యాచ్ ఆడిన వెంటనే అలసిపోయేంత పనిభారం ఏముందని సూటిగా ప్రశ్నించారు. కీలకమైన సిరీస్ జరుగుతున్నప్పుడు ప్రధాన బౌలర్‌కు విశ్రాంతి ఇవ్వడం వల్ల జట్టు సమతుల్యత దెబ్బతింటుందని, ఇది అభిమానులను నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం ఆడే మ్యాచ్‌ల కంటే ఐపీఎల్ లేదా ఇతర లీగ్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఒక ఫాస్ట్ బౌలర్ రిథమ్ అందుకోవాలంటే వరుసగా మ్యాచ్‌లు ఆడాలని, ఇలా విడతలవారీగా ఆడిస్తే ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో ఇబ్బందులు తప్పవని కైఫ్ హెచ్చరించారు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ కైఫ్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అసలు దేనికి విశ్రాంతి? ఏం పని చేశారని ఒత్తిడి అంటున్నారు? మైదానంలో దిగి వికెట్లు తీస్తేనే ఆత్మవిశ్వాసం వస్తుంది. నెట్స్‌లో ఎంత సేపు బౌలింగ్ చేసినా మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోతే ప్రయోజనం ఉండదు" అని ఆయన తేల్చిచెప్పారు. సీనియర్లు లేకపోవడం వల్ల యువ బౌలర్లపై అదనపు భారం పడుతుందని, అది వారి ప్రదర్శనపై ప్రభావం చూపుతుందని విశ్లేషించారు. జట్టు యాజమాన్యం మాత్రం రాబోయే టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రాను రొటేషన్ పద్ధతిలో వాడుతున్నట్లు తెలుస్తోంది. అయితే కైఫ్ ఈ వాదనను పూర్తిగా తప్పుబట్టారు. గతంలో కూడా ఇలాంటి ప్రయోగాల వల్లే కీలక సమయాల్లో టీమిండియా చేతులెత్తేసిందని గుర్తు చేశారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు ఆడుతున్నప్పుడు కేవలం బౌలర్లకు మాత్రమే ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారని ఆయన నిలదీశారు. సోషల్ మీడియాలో కూడా కైఫ్ వ్యాఖ్యలకు అనూహ్య స్పందన లభిస్తోంది. సొంతగడ్డపై సిరీస్ గెలవాల్సిన సమయంలో ఇలాంటి నిర్ణయాలు సరికాదని క్రికెట్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. బుమ్రా లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని, కివీస్ బ్యాటర్లను కట్టడి చేయడంలో భారత బౌలర్లు తడబడుతున్నారని విశ్లేషకులు అంటున్నారు. ఈ వివాదంపై టీమ్ మేనేజ్‌మెంట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# చివరి 2 టీ20లకు తిలక్ వర్మ దూరం..

తెలుగు తేజం, టీమిండియా స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ మరికొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో చివరి రెండు టీ20లకు అతడు అందుబాటులో ఉండదని బీసీసీఐ సోమవారం ధృవీకరించింది. జనవరి 7న రాజ్‌కోట్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న 23 ఏళ్ల తిలక్ వర్మ పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరింత సమయం పడుతుంది. తిలక్ వర్మ ఇటీవల జనవరి 7న రాజ్‌కోట్‌లో పొత్తికడుపు సమస్యతో చిన్న సర్జరీ చేయించుకున్నాడు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. తిలక్ ఆరోగ్యంగానే ఉన్నాడు. కానీ ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం అతడు కొన్ని రోజులు మ్యాచ్‌లు ఆడే అవకాశం లేదు. టీ20 వరల్డ్ కప్ కోసం అతడు మరింత ఫిట్, ఆరోగ్యంగా ఉండాలని భావించిన బీసీసీఐ మేనేజ్‌మెంట్, కోచ్ తిలక్ వర్మకు విశ్రాంతినిచ్చారు. ఫిబ్రవరిలో జరగనున్న ప్రపంచ కప్ కోసం ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ చివరి రెండు మ్యాచ్‌లకు సైతం అతడు అందుబాటులో ఉండడని తెలిపారు. భారత అభిమానులకు శుభవార్త. తిలక్ వర్మ ఫిబ్రవరి 3న ముంబైలో జాతీయ జట్టుతో కలవనున్నాడు. ఫిబ్రవరి 7న ప్రారంభమయ్యే 2026 ఐసిసి పురుషుల టీ20 ప్రపంచ కప్‌కు ముందు జరిగే వార్మప్ మ్యాచ్‌లకు స్టార్ బ్యాటర్ అందుబాటులో ఉంటాడని తెలుస్తుంది. "తిలక్ వర్మ జనవరి 7, బుధవారం నాడు రాజ్‌కోట్‌లో పొత్తికడుపు సమస్య రావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. తరువాత శుక్రవారం హైదరాబాద్‌కు తిరిగి వెళ్లాడు. ప్రస్తుతం తిలక్ ఆరోగ్యంగా ఉన్నాడు. వేగంగా కోలుకుంటున్నాడు' అని బీసీసీఐ గతంలో ఒక అప్‌డేట్‌లో తెలిపింది. పూర్తిగా కోలుకోవడంతో పాటు ఫిట్ నెస్ ముఖ్యమని, త్వరలో అతడు జట్టుతో కలుస్తాడని బీసీసీఐ పేర్కొంది. తిలక్ దూరం కావడంతో, న్యూజిలాండ్ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు అతని స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌ను కొనసాగించాలని సీనియర్ మెన్ సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసింది. అయ్యర్ సిరీస్ లో కొనసాగనున్నాడు. జట్టు యాజమాన్యం ఇషాన్ కిషన్‌ను నెం. 3 స్థానంలో బ్యాటింగ్ చేపిస్తుంది. అయితే మొదటి మూడు మ్యాచ్‌ల్లో పూర్తిగా విఫలం కావడంతో సంజూ శాంసన్ పై ఒత్తిడి పెరిగింది. చివరి రెండు టీ20ల్లోనూ సంజూ ఇలాగే ఆడితే టీ20 వరల్డ్ కప్ లో శాంసన్ తుది జట్టులో ఉండటం కష్టమే. ఇషాన్ కిషన్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాడు. వరల్డ్ కప్ లో తిలక్ వచ్చాక కిషన్ బెంచ్ మీదకు వెళ్లక తప్పదు. కానీ సంజూ శాంసన్ ఫామ్, ఆటతీరు చూసి మేనేజ్‌మెంట్ కరుణిస్తే తుది జట్టులో ఇషాన్ కిషన్ వికెట్ కీపర్ బ్యాటర్ గా సేవలు అందించనున్నాడు.



# తుదిదశకు డ్రాగన్ షూటింగ్

## జూన్ 25న విడుద లచేసేలా ప్లాన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్-ఇండియన్ సినిమా పై తాజాగా క్రేజీ అప్‌డేట్ బయటికి వచ్చింది. వర్కింగ్ టైటిల్: డ్రాగన్ పేరుతో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో దూసుకుపోతోంది. తాజాగా ఈ సినిమా ప్రస్తుత షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఎక్కువగా నైట్ ఎఫెక్ట్‌తో నైట్ షూటింగ్ నిర్వహించారని టాక్. తదుపరి షెడ్యూల్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ అంటేనే భారీ యాక్షన్, డార్క్ టోన్, పవర్‌ఫుల్ ఎలివేషన్లు గుర్తుకు వస్తాయి. అదే ఫార్ములాను ఈసారి ఎన్టీఆర్ స్థాయికి మించి చూపించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్యూర్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో యాక్షన్ సీక్వెన్సులు అత్యంత ఇంటెన్స్‌గా ఉండబోతున్నాయట. ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ యాక్షన్ రోల్స్‌లో ఇది ఒకటిగా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన అన్ని సినిమాల్లోకెల్లా ఇదే బెస్ట్ మూవీ అవుతుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌసెస్‌గా గుర్తింపు పొందిన మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో, పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవి బస్రూర్ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్, కీలక పాత్రలో అనిల్ కపూర్ కనిపించినున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని భాషల్లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది. జూన్ 25 సినిమాని విడుదల చేసే ప్లాన్ చేస్తున్నారు.



# చిత్రపరిశ్రమకు వచ్చే వారిని ప్రోత్సహించాలి

## ఇక్కడ కాస్ట్ కౌచింగ్ అంటూ ఏదీ లేదు



సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి పనిచేస్తానని ఏ ఆడబిడ్డ, మగబిడ్డ అయినా అంటే వారిని ప్రోత్సహించి పంపాలని, తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పదని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. జీవితాంతం ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' భారీ విజయాన్ని అందుకుని రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చిరంజీవి మాట్లాడారు. మళ్లీ విజయోత్సవాలను జరుపుకొనే వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడికి దక్కుతుంది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన తెలుగు సినీ ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమా టీమ్ విజయానందాన్ని అనుభవిస్తుంటే, నాకూ సంతోషంగా ఉంది. అనిల్‌ను చూస్తుంటే రాఘవేంద్రరావుగారు గుర్తుకు వచ్చేవారు. రోజూ సెట్‌లో వినోదాన్ని పంచేవారు. ఈ మూవీ షూటింగ్‌కు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ప్రతి సినిమా కష్టపడి పనిచేస్తాం. కానీ, కొన్ని సినిమా ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తాయి. అలాంటిదే ఈ మూవీ. ఈ సంక్రాంతికి దాదాపు అన్ని సినిమాలను ఆదరించారు. సినిమాలో వెంకీ ఉండాలని కోరుకున్నా. దాన్ని అనిల్ సాకారం చేశాడు. ఎంత పెద్ద స్టార్‌నైనా హ్యాండిల్ చేసే సామర్థ్యం అనిల్ రావిపూడికి ఉంది. మళ్లీ అనిల్‌తో చేసే అవకాశం మా ఇద్దరిలో ఎవరికి వస్తుందో చూడాలి.' ఇక నా కుమార్తె ఇండస్ట్రీలోకి వస్తానంటే ప్రోత్సహించిన తొలి వ్యక్తి మా అబ్బాయి రామ్‌చరణ్. 'రంగస్థలం' కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేసింది. కష్టం ఒక్కటే ఆయుధమని తెలుసుకున్న వ్యక్తి నా కుమార్తె సుస్మిత. సినీ ఇండస్ట్రీ అద్దంలాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితాన్నే ఇస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలన్నారు.. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు. నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది. ఇందులో చేసిన ప్రతి నటుడు, సాంకేతిక నిపుణుడు ఎంతో ఉత్సాహంగా నటించారు. నయనతార సినిమాలో చేయడమే కాదు, ప్రమోషన్స్ కూడా చేసింది. ఆ మెరిట్ కూడా అనిల్‌కే దక్కుతుంది. సినిమా పరుగులు పెట్టడానికి ఎడిటర్ తమ్మిరాజు కారణం. ఇటీవల ఒకామె మాట్లాడిన వీడియో చూసి, భావోద్వేగానికి గురయ్యా. 'ఏమయ్యా.. చిరంజీవి ఎప్పటి నుంచో కష్టపడుతూనే ఉన్నావు. మమ్మల్ని ఆనందింపజేయడానికి ఓపిక ఉన్నా లేకపోయినా ఇప్పటికీ అలాగే పనిచేస్తున్నావు. డబ్బుల కోసం నువ్వు పనిచేస్తున్నావని నేను అనుకోను. నువ్వు ఇలా కష్టపడుతుంటే నాకు బాధగా ఉంది' అని అన్నారు. నిజంగా ఆ తల్లికి ఈ సభాముఖంగా ధన్యవాదాలు చెబుతున్నా. చిరంజీవి మమ్మల్ని అలరించాలనే కోరుకునే మీ పాజిటివ్ ఎనర్జీ నుంచే నాకు ఈ శక్తి వస్తోంది. ఈ జన్మ ఉన్నంత వరకూ మిమ్మల్ని అలరిస్తూనే ఉంటాను అని చిరంజీవి అన్నారు.


# ఇరుముడితో రవితేజ కొత్త మూవీ

మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.




# 30న వస్తున్న విజయ్ సేతుపతి గాంధీ టాక్స్

టాకీ యుగం ప్రారంభమైన తర్వాత వచ్చిన అతి తక్కువ ప్రయోగాత్మక చిత్రాల్లో 'పుష్పక విమానం' ఒకటి. ఆ కోవలో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మూవీ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది 'గాంధీ టాక్స్'. విజయ్ సేతుపతి, అదితీరావ్ హైదరీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుందీ సినిమా. ఈ నెల 30న థియేటర్లలో విడుదల కానుంది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.




# మరోసారి పోలీసు అధికారిణిగా..రాణిముఖర్జీ

మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంఛైజీలో 'మర్దానీ 3' రాబోతోంది. రాణి ముఖర్జీ మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపించనున్నారు. జనవరి 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# సెలెక్టెడ్‌గానే ఐటమ్ సాంగ్స్ చేస్తా: రష్మిక

ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు. ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు 'హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు' అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం. తెలుగులో లేడీ ఓరియెంటెడ్ సినిమా 'మైసా'లో కీలక పాత్రలో నటిస్తుండగా, విజయ్ దేవరకొండ 14వ సినిమాలోనూ హీరోయిన్‌గా ఎంపికైంది. మరోవైపు బాలీవుడ్‌లో 'కాక్‌టెయిల్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. నటిగా, డాన్సర్‌గా తనను తాను విభిన్నంగా ప్రెజెంట్ చేసుకుంటూనే, అవసరమైతేనే ఐటం పాటలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నదే రష్మిక స్ట్రాటజీగా కనిపిస్తోంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463